ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 16 సెప్టెంబరు 2024


క్రేన్ సాయంతో వినాయకుడిని గంగ ఒడికి చేర్చుతున్న దృశ్యం


విద్యుత్ కాంతులతో శోభాయమానంగా వినాయక ఘాట్



బై బై.. గణేశా

- నిమజ్జనోత్సవంలో యువత సందడి
- నగరంలో 2 వేలకు పైగా విగ్రహాలు నిమజ్జనం
- కోలాహలంగా సాగిన శోభాయాత్ర
- ముగిసిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు


కర్నూలు (కల్చరల్/న్యూసిటీ), సెప్టెంబరు 15: నగరంలో గణేశ్ నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా సాగాయి. తొమ్మిది రోజులుగా మండపాల్లో పూజలు అందుకున్న వినాయకుడు ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లారు. ఉత్సవాల్లో యువత, పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ ఏడాది ఐదు అడుగుల నుంచి ఇరవై అడుగుల వరకు వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు. వివిధ వేషధారణలు ధరించి భక్తులను ఆకట్టుకున్నారు. బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ, డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో ఊరేగింపుగా వినాయక ఘాట్‌కు వెళ్లారు. 'గణపతి బొప్పా మోరియా' అనే నినాదాలు చేశారు. పాతనగరం నుంచి వినాయక ఘాట్ వరకు, అటు నంద్యాల చెక్‌పోస్టు, ఇటు బళ్లారి చౌరస్తా, మరోవైపు కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి నాలుగు చోట్ల నుంచి ఘాట్ వరకు రహదారులన్నీ జనంతో కిటకిటలాడాయి. నగరంలోని ప్రధాన రహదారుల్లోని దుకాణాలను నిర్వాహకులు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు, యువత నిమజ్జనాన్ని వీక్షించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు.


నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు


నీటిలో మునిగిపోతున్న విగ్రహం

సిరి సంపదలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి : మంత్రి భరత్

సిరి సంపదలతో జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని గణనాథుడిని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ వేడుకున్నారు. ఉదయం రాంబొట్ల దేవాలయం వద్ద వివేకానంద యువజన సంఘం ఏర్పాటు చేసిన తొలి నిమజ్జన గణపతి విగ్రహాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం, కోడుమూరు. ఆదోని ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, పార్థసారథి, జేసీ బి.నవ్య, ఎస్పీ బిందుమాధవ్, నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి రూ.2.35లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం రాంబొట్ల దేవాలయం ప్రాంగణంలో కర్నూలు మరాఠా సేవాసంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మంత్రి, ఎస్పీ, జేసీ ఇతర ప్రజా ప్రతినిధులు నిమజ్జనం చేశారు.


యువతుల కేరింతలు


డ్యాన్స్ చేస్తున్న యువతులు


డ్రమ్స్ కొడుతున్న యువతీ యువకులు


కొండారెడ్డి బురుజు వద్ద భక్తుల కోలాహలం


వినాయక ఘాట్ వద్ద నిమజ్జన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు




ట్రాక్టర్‌పై ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు


నిమజ్జనాన్ని వీక్షిస్తున్న భక్తులు


నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న వినాయకులు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 15: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. మిలాద్- ఉన్- నబీ పండుగ సంద ర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు కావడంతో రద్దు చేసినట్లు తెలిపారు.

19 నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 15: ఈనెల 19 నుంచి ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్నవారికి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గనులశాఖ డీడీ రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలి పారు. అక్రమాలను అరికట్టేందుకు జీవో నెంబరు 52 అమలులోకి వచ్చిందని చెప్పారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా ఇసుక సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో

శ్రీశైలం, సెప్టెంబరు 15: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి ఆదివారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 27,850 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 13,437 క్యూసెక్కులు మొత్తం 41,287 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 59,574 క్యూసె క్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.40 అడుగు లుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 206.0996 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,078 క్యూసె క్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

ఎమ్మిగనూరు మార్కెట్‌కు భారీగా పంట ఉత్పత్తులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 15: వేలాది బస్తాల పంటఉత్పత్తులు విక్రయానికి రైతులు తరలించటంతో ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కిటకిటలాడింది. వచ్చిన వేరుశనగ, ఆముదాల బస్తాలను ఎక్కడ దించాలో తెలియక రైతులు, కమీషన్ ఏజెంట్లు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్‌కు ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, గూడూరు తదితర ప్రాంతాలనుంచి రైతులు పెద్ద ఎత్తున వేరుశనగను తరలించారు. 24040 బస్తాలు(7212క్వింటాళ్లు) వేరుశనగ, 887 ఆముదాల సంచులు (444క్వింటాళ్లు) మొత్తం 24927 బస్తాలు విక్రయానికి మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చారు. దీంతో మార్కెట్ పంట ఉత్పత్తులతో కిక్కిరిసింది. దీనికి తోడు మరో ఐదారు వేల బస్తాలు వచ్చినప్పటకీ మార్కెట్‌లో విక్రయానికి పెట్టేందుకు స్థలం లేకపోవటంతో రైతులు గోడౌన్లలో నిలువ చేసి వెళ్లినట్లు సమాచారం. 24927బస్తాలు రావటంతో సరుకును ఎక్కడ విక్రయానికి ఉంచాలో తెలియక కమీషన్ ఏజెంట్లు నానా ఇబ్బందులు పడాడ్డారు. స్థలం లేకపోవటంతో కొంతమంది ఏజెంట్లు మార్కెట్‌లో


వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి వచ్చిన వేరుశనగ


మార్కెట్ ఆవరణలో పంట ఉత్పత్తులను దించడానికి స్థలం లేకపోవటంతో నిలిచిపోయిన వాహనాలు

ఉన్న రహదారి పక్కన, టెండర్ హాల్ ముందు ఉన్న రహదారిలో అమ్మకానికి పెట్టారు. ప్రధానంగా మార్కెట్ వెనుక భాగంలో టీఎంసీలో కూరగాయల హోల్‌సెల్ దుకాణాలు ఉండటంతో అక్కడ పంట ఉత్పత్తులు విక్రయించే అవకాశం లేకపోయింది. అంతేగాక పెద్దఎత్తున సరుకు రావటంతో టెండరు సైతం ఆలస్యం అయింది. కాగా ఆదివారం మార్కెట్ కమిటీలో వేరుశనగ క్వింటం గరిష్ఠ ధర రూ. 7,180, కనిష్ఠ ధర రూ. 2200, ఆముదాలు క్వింటం గరిష్ఠ ధర రూ.5682, కనిష్ఠ ధర రూ.4530 పలికింది. మార్కెట్ కమిటీకి ఊహించనంతగా పెద్దఎత్తున పంట ఉత్పత్తులు రావటంతో సరుకు తెచ్చిన వాహనాలతో మార్కెట్ దగ్గర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవటంతో మార్కెట్‌కు సరుకు తెచ్చిన రైతులు, వాహనదారులు, కమీషన్ ఏజెంట్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు మిలాద్ ఉన్ నబీ

ముస్తాబైన మసీదులు



కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15: ముస్లింలకు అత్యంత పవిత్రమైన ఈద్-ఏ-మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలు సోమవారం వైభవంగా జరగనున్నాయి. ఇందు కోసం పట్టణాలు, పల్లెల్లోని మసీదులు, దర్గాలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా ముస్లింలు ర్యాలీలు, అన్నదాన కార్యక్రమాలు, మత పెద్దల బోధనల కోసం ఏర్పాట్లు చేశారు.

మిలాద్ ఉన్ నబీ విశిష్టత

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్నే కొన్ని ముస్లిం తెగలు ఈద్-ఏ-మిలాద్-ఉన్-నబీగా జరుపుకొంటారు. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం మూడో నెల రబీ అల్-అవ్వల్ 12వ రోజున ముస్లింలు ఈ పర్వదినాన్ని గుర్తించి వేడుకలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సెప్టెంబరు 15 సాయంత్రం నుంచి ప్రారంభం కాగా సోమవారం సాయంత్రం ముగుస్తుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ముస్లింలు వేడుకలు నిర్వహించడానికి సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా నూతన దుస్తులు ధరించి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీలు, సహపంక్తి భోజనాలు, అన్నదానం చేయడం ఆనవాయితీ.

పర్యాటక ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 15: ఆంధ్రప్రదేశ్ టూరిజమ్ అథారిటీ విజయవాడ ఆదేశాల మేరకు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ఎక్సలెన్స్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి విజయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు టూర్స్ అండ్ ట్రావెల్స్ సంబంధిత సంస్థల నుంచి దరఖాస్తులు పంపాలన్నారు. ఈ నెల 22లోపల వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజమ్.ఏపీ.జీవోవీ.ఇన్‌కు సంప్రదించాలన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీమంతం ప్రాంగంణంలో భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం లక్షలాది భక్తులు తరలి వచ్చారు. ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిర్సింది. మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అశేషంగా భక్తజనం తరలి రావడంతో శ్రీమఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిలు ప్రత్యేక బారికేడ్ల ద్వారా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

అన్నదాన పథకానికి రూ.18.73 లక్షలు విరాళం

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం అన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన తిమ్మయ్య రూ.లక్ష, బెంగళూరుకు చెందిన తేజస్ అనే భక్తుడు రూ. రెండు లక్షలు, అదే విధంగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులతో కలిపి రూ.18.73 లక్షలు విరాళంగా వచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం దాతలు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది, సెప్టెంబరు 15: ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా సెలవులు రావడంతో మహానంది క్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసింది. రెండు రోజుల నుంచి క్షేత్రంలోని ప్రధాన వీధులు భక్తుల రద్దీతో కళకళలాడుతున్నాయి. తెల్లవారుజామునసే ఆలయం ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా సోమవారం కూడా మహానందిలో భక్తుల రద్దీ ఉండే అవకాశం ఉంది. ఈవో నల్లకాల్వ శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

మహానందిలో కర్ణాటక హైకోర్టు జడ్జి



మహానంది క్షేత్రంలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర

మహానంది క్షేత్రంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రామచంద్ర కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలను భక్తి శ్రద్ధలతో జరిపారు. కల్యాణ మంటపంలో వేదపండితులు ఆశీర్వదించారు.

ఆత్మహత్య చేసుకుంటున్నట్లు యువకుడి సెల్ఫీ వీడియో

- ఎస్పీకి సమాచారం ఇచ్చిన బంధువులు
- అప్రమత్తం చేయడంతో యువకుడిని కాపాడిన పోలీసులు

నంద్యాల క్రైం, సెప్టెంబరు 15 : భార్య వియోగంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడిని నంద్యాల జిల్లా పోలీసులు రక్షించారు. గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన మానస (22) అనే వివాహిత శనివారం కుటుంబకలహాలతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా మానస భర్త దామోదరం అశోక్ జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకున్నానని బంధువులకు సెల్ఫీ వీడియో పెట్టాడు. విషయాన్ని బంధువులు వెంటనే నంద్యాల ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల డీఎస్పీ రంగప్రవేశం చేసి పోలీసు సిబ్బందితోపాటు బ్లూ కోల్ట్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. బ్లూకోల్ట్ సిబ్బంది పొన్నాపురం నుంచి వెంకటేశ్వరపురం వరకు రైల్వే ట్రాక్, బనగానపల్లె రైల్వే ట్రాక్ వైపు వెదికారు. పోలీసుల రాకను గమనించిన దామోదరం అశోక్ రైల్వే ట్రాక్ నుంచి నంద్యాల బస్టాండ్ వైపు అక్కడి నుంచి శ్రీనివాస సెంటర్ మీదుగా రాజ్‌థియేటర్ వైపు వెళ్తుండగా సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు ఎస్పీ, డీఎస్పీలు సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో సినీఫక్కీలో దామోదరం అశోక్‌ను నంద్యాల టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ అతడికి కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులను రప్పించి అప్పగించారు. దీంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. క్షణం ఆలస్యం చేయకుండా యువకుడిని కాపాడిన ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల డీఎస్పీ, టూ టౌన్ సీఐ, బ్లూ కోర్ట్ సిబ్బంది, పట్టణంలోని పోలీస్‌సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అరిష్టమని..

వ్యక్తి మృతదేహాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

ఆదోని, సెప్టెంబరు 15 : మృతదేహాన్ని కాలనీలోకి తీసుకొస్తే అరిష్టమని అడ్డుకున్న ఘటన ఆదోని పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదోని పట్టణంలోని శంకర్ నగర్ కాలనీకి చెందిన రాఘవేంద్ర (35) ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అక్కడ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకొని తాము నివాసముంటున్న శంకర్ నగర్ స్వగృహానికి తీసుకొస్తుండగా కాలనీ వాసులు అడ్డుకున్నారు. దీంతో కాలనీ వాసులకు బాధిత కుటుంబ సభ్యులకు మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి చేసేది లేక బాధిత కుటుంబ సభ్యులు రాఘవేంద్ర మృతదేహంతో తమ బంధువులు నివాస ముంటున్న చిన్న మార్కెట్‌కు తీసుకువెళ్లి అక్కడ అంత్యక్రియలు చేసినట్లు సమాచారం.

అదృశ్యం కేసు నమోదు

హొళగుంద, సెప్టెంబరు 15 : మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అనే యువకుడు గత 15 రోజులుగా కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలనరసింహులు ఆదివారం తెలిపారు. మల్లేష్ ఈ నెల ఒకటవ తేదీన ఇంటి నుండి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికి నా కనిపించలేదన్నారు. కుటుంబ సభ్యుడు గుడుదప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

హొళగుంద, సెప్టెంబరు 15 : మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామానికి చెందిన హనుమంతప్ప అనే రైతుకు చెందిన బైక్ శనివారం రాత్రి అపహరణకు గురైనట్లు ఆదివారం తెలిపారు. ఎనిమిది నెలల క్రితం తెలంగాణకు వలస వెళ్లి అక్కడ కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపాడు. పెద్దహ్యాటలో శనివారం రాత్రి ఇంటి ముందు నిలబెట్టిన బైక్, ఉదయం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌యూలో టైం స్కేల్ వివాదం



- ఉద్యోగుల జీత, భత్యాలకు వర్సిటీ నిధులు
- ఫైనాన్స్ అప్రూవల్ లేని టైం స్కేల్‌ను రద్దు చేయాలి
- లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాలు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 15: ఆర్‌యూలో టైం స్కేల్ వివాదం ముదురుతోంది. ఉద్యోగుల జీత, భత్యాలకు వర్సిటీ నిధులు వెచ్చించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటై దాదాపు 15 సంవత్సరాలవుతున్నా ఇప్పటి వరకు నాన్ టీచింగ్ విభాగానికి సంబంధించి ఒక్క నోటిఫికేషన్ లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం వర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగులు దాదాపు 250 మంది ఉన్నట్లు వర్సిటీ రికార్డులు సూచిస్తున్నాయి. అందులో 110 మంది టైం స్కేల్ ఉద్యోగులు, ప్రభుత్వ అనుమతి లేని 13 మంది రెగ్యులర్ ఉద్యోగులు, తాజాగా వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న మరో 11 మంది నాన్ టీచింగ్ ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. వర్సిటీ అధికారులు తమ స్వార్థం కోసం పదవీ కాలంతో పబ్బం గడుపుకోవడానికి విచ్చలవిడిగా ముడుపులు తీసుకొని అడ్డగోలుగా ఉద్యోగాలు కట్టబెట్టారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకపోయినా 110 మందిని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించడం, వారికి ప్రభుత్వ అనుమతి లేకున్నా ఇతర అలవెన్సులు వర్తింపజేయడం..అది కూడా యూనివర్సిటీ నిధుల నుంచి జీతాలు ఇవ్వడం చర్చనీయాంశమైంది. వీటిపైన విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఉద్యమాలకు తెరలేపాయి. తక్షణమే టైం స్కేల్ రద్దు చేయాలని, విద్యార్థుల సొమ్మును విద్యార్థుల డెవలప్‌మెంట్ కోసం ఉపయోగించకుండా ఉద్యోగుల జీత, భత్యాలకు ఎలా ఉపయోగిస్తారని విద్యార్థి సంఘాలు ఇటీవల లోకాయుక్తలో ఫిర్యాదు చేశాయి. వసతి గృహాల్లో ఇద్దరు సూపర్ వైజర్లను ఉద్యోగులుగా చేర్చుకుని రెండు ఏళ్లలోపే వారికి టైం స్కేల్ వర్తింపజేయడం గతంలో పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. టైం స్కేల్‌ను రద్దు చేసి వర్సిటీలో ఉద్యోగులకు నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఇటీవల రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను వినతి పత్రం ద్వారా మంగళగిరిలో జరిగిన ప్రజా దర్బార్‌లో కోరారు. ఉద్యోగులకు సీఎఫ్‌ఎంఎస్‌తో సంబంధం లేకుండా ఇంటర్నల్‌గా జీతాలు వర్సిటీ నిధుల నుంచి ఇవ్వడంతో ప్రతి సంవత్సరం రూ.3 కోట్లకు పైగా ఖజానా నుంచి ఇస్తున్నారు. దీన వల్ల వర్సిటీ అభివృద్ధి కుంటుపడుతోంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీ ఖజాన ఖాళీ కాకుండా, నోటిఫికేషన్ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

టైం స్కేల్‌ను తక్షణమే రద్దు చేయాలి

తక్షణమే టైం స్కేల్‌ను రద్దు చేసి వర్సిటీ ఖజానకు గండి పడకుండా చర్యలు తీసుకోవాలి. ఇదే విషయంపై ఇటీవల లోకాయుక్తకు కూడా ఫిర్యాదు చేశాం. నోటిఫికేష్ ద్వారా నియమకాలు చేపట్టకుండా గత ఉపకులపతులు, అధికారులు నియామకాలు చేపట్టడం ఎంత వరకు సమంజసం. ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే వర్సిటీ ఖజాన నుంచి జీత, భత్యలు ఇవ్వడం అంటే విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించడమే. విద్యార్థులు చెల్లించిన ఫీజుల ద్వారా వర్సిటీలో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేయాల్సింది పోయి సిబ్బందికి ఎలా వేతనాలు ఇస్తారు.

- రాగిరి చంద్రప్ప, రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఎఫ్

జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ విశ్వేశ్వరయ్య



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఇంజనీర్లు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీఆర్ ఇంజనీర్లు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 15: ఇంజనీరింగ్ రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వారిలో భారత జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా టెలికాంనగర్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాహబూబ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు రామనీలా, కోశాదికారి అనంత్‌నాత్, ఉమెన్ సెక్రటరీ సనా చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా పరిషత్ ఆవరణలో విశ్వేశ్వరయ్య భవన్ వద్ద మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పీఆర్ ఈఈలు ఎస్‌సీఈ మద్దన్న, రామక్రిష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఈ టూ పీఏ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, డీఈలు నాగిరెడ్డి, రమేష్‌కుమార్ రెడ్డి, ఏఈలు గౌసబాష, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.
- సమాజాభివృద్ధికి శ్రమిస్తున్న ఇంజనీర్లు విశ్వేశ్వరయ్యను ఆదర్శకంగా తీసుకోవాలని ఐజేకే ఇంజనీరింగ్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ టి.పద్మజ అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని గాయత్రి ఎస్టేట్‌లోని మోక్షగుండం విశేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అకడమిక్ మేనేజర్ పరుశరాములు, వైస్ ప్రిన్సిపాల్ స్వాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న నరసింహారావు

శిరివెళ్ల, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు రూ.2.03 లక్షలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌లోని సీఎం చంద్రబాబు నాయుడు నివాసంలో నేరుగా ఆయనను కలిసి రూ.2.03 లక్షల చెక్కును గోగిశెట్టి నరసింహారావు ఆదివారం అందజేశారు. నరసింహారావు మాట్లాడుతూ సీఎం ఆదేశాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యలతో ఎన్నో కుటుంబాలు కోలుకున్నాయన్నారు. ముందుచూపు, విజన్‌తో పని చేసే సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోనే విజయవాడ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గోగిశెట్టి ఆరోపించారు.

విజయవాడ వరద బాధితులకు విరాళం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు చెక్కుల అందజేత



విరాళం చెక్కును ఎమ్మెల్యేకు అందజేస్తున్న టీడీపీ నాయకుడు ఈవీ రమణ

కల్లూరు, సెప్టెంబరు 15: విజయవాడ వరద ముంపు బాధితులకు విరాళాలు అందించడం చాలా సంతోషంగా ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే స్వగృహంలో పలు గ్రామాల నాయకులు వరద బాధితుల కోసం చెక్కులను అందజేశారు. కల్లూరు మండల పరిధిలోని నాయకల్లు టీడీపీ నాయకులు వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు వాకిటి మాదేష్ ఆధ్వర్యంలో రూ. 1,11,016 విరాళాన్ని గౌరు చరితకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నీలకంఠం లక్ష్మన్న, శ్రీనివాసులు, పెద్దమద్దయ్య, నాగేశ్వరరావు, బాలన్న, రామకృష్ణ ఉన్నారు. అలాగే తడకనపల్లె సర్పంచు, టీడీపీ నాయకురాలు ఎస్.సహారాబీ ఆధ్వర్యంలో సేకరించిన రూ. 1,76,100ను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు జేబేదాబీ, సుల్తాన్‌బాషా, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.



వరద బాధితులకు విరాళం అందజేస్తున్న సర్పంచ్ సహరాబీ, సుల్తాన్‌బాషా

'క్రీడల్లోనూ రాణించాలి'



విజేతలతో కేవీ సుబ్బారెడ్డి తదితరులు

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 15: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ ఆట్యాపాట్యా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్రీడల్లో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడాల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లినప్పుడే వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన పల్నాడు జిల్లా జట్టుకు అతిథులతో కలిసి డాక్టర్ వాసురెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కర్నూలు జట్టు ఉత్తమ ప్రదర్శన కనబరిచి తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, ఆట్యా పాట్యా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరత్నమయ్య, బాలపవన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాణ్యం, సెప్టెంబరు 15 : మండలంలోని కొండజూటూరు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో గ్రామానికి చెందిన జాకీర్ హుశేన్ (52) మృతి చెందారు. పాణ్యం పోలీసులు తెలిపిన వివరాలివీ.. పోలూరు నుంచి కొండజూటూరుకు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో హఠాత్తుగా ఎదురు రావడంతో అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. క్షతగాత్రుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 15 : కోవెలకుంట్ల పట్టణంలోని గుంజలపాడు రహదారిలో ఉన్న షిర్డీసాయిబాబా దేవాలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సాయిబాబా దేవాలయం తలు పుల తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి వాచ్‌మెన్ కొండయ్య నిద్రిస్తుండగా దాడి చేసి ముఖానికి వస్త్రాన్ని కట్టారు. దేవాలయంలోని హుండీని పగలగొట్టి రూ.15వేల నగదును ఎత్తుకెళ్లారు. అలాగే ఆలయంలో ఉన్న బ్యాటరీని పగలగొట్టి కరెంటు ఫీజును కూడా పెరికివేశారని ఆలయ పూజారి సతీష్ తెలిపారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి కుమారుడిపై దాడియత్నం

నంద్యాల, సెప్టెంబరు 15 (రూరల్): మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుమారుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌పై ఆదివారం రాత్రి దుండగులు దాడికి యత్నించారు. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఫిరోజ్ పార్టీ కార్యాలయం నుంచి బయటకు వస్తుండగా గుర్తు తెలియన నలుగురు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డగించి దాడి చేయడానికి యత్నించారు. వాహనంలోని కార్యకర్తలు వెంటనే తేరుకుని దాడి యత్నాన్ని అడ్డగించి, దుండగులను పట్టుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. మంత్రి కుమారుడిపై నడిరోడ్డు మీద దాడికి పాల్పడటంతో నంద్యాలలో కలకలం రేపింది. దాడికి దుండగులు ఎందుకు పాల్పడ్డారనే విషయంపై వివరాలు తెలియాల్సి ఉంది. అయితే ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవటంతో పోలీసులు కేసు ఇంకా కేసు నమోదు చేయలేదు.

చికిత్స పొందుతూ విద్యుత్ కార్మికుడి మృతి

పాణ్యం, సెప్టెంబరు 15 : విధి నిర్వహణలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యుత్ కార్మికుడు ఓజ శ్రీనివాసులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు విద్యుత్ శాఖ అధికారి సుందరరాజు తెలిపారు. ఆదివారం విద్యుత్ సిబ్బంది శ్రీనివాసులు (54) మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గోస్పాడు,సెప్టెంబరు15: గోస్పాడు తెల్లపూరి గ్రామాల మధ్య కుందూ నది పరివాహక ప్రాంతంలోని పంట పొలాలలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ ఆదివారం తెలిపారు. సుమారు మగ మృతదేహం సుమారు 45-50 సంవత్సరాల మధ్య వయసు ఉంటుదని, బ్రౌన్ కలర్ షర్టు, నస్యం కలర్ ఫుల్ డ్రాయర్ ధరించినట్లు పేర్కొన్నారు. సుమారు 5.8 అడుగుల ఎత్తు ఉన్నారని మృతదేహాన్ని గుర్తు పట్టిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు/ కోడుమూరు రూరల్, సెప్టెంబరు 15: భారీ మొత్తంలో కర్ణాటక మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మద్యంతోపాటు రెండు కార్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. క్రిష్ణగిరి మండలానికి చెందిన మోహన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, కప్పట్రాలకు చెందిన వీరకృష్ణ, సి.బెళగల్ మండలానికి చెందిన యుగంధర్‌గౌడ్ కలిసి గత నెల రోజుల నుంచి కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నారు. ఇందులో భాగంగా క్రిష్ణాపురం గ్రామం సమీపంలో తెచ్చిన మద్యం ఇతర గ్రామాలకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రెండు కార్లు, రెండు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. పరార్ అయిన మరో నింది తుడు జయన్న కోసం గాలింపు చేపడుతున్నారు. పట్టుపడిన మద్యం విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుంది. ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు, ఏఎస్ఐ సురేంద్ర, కానిస్టేబుల్ జగదీష్, భాస్కర్, హోంగార్డు రాముడు, శేఖర్ ఉన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై ఎక్సైజ్ దాడులు

కర్నూలు(అర్బన్): వినాయక నిమజ్జనం సందర్భంగా మద్యం అక్రమ అమ్మకాలపై దాడులు నిర్వహించామని ఎక్సైజ్ శాఖ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలో నిమజ్జనం సందర్భం గా ముజఫర్‌నగర్‌లోని కిరణ్ కుమార్‌గౌడ్ నుంచి 192 తెలంగాణ విస్కీ మద్యం బాటిళ్లు సీజ్ చేశామని, తెలంగాణలోని పుల్లూరుకు చెందిన బోయ సీతారాముడు నుంచి 30 బాటిళ్లను ఆటోలో తరలిస్తుండగా ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, ఎస్ఐలు మారుతీ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

రుద్రవరం, సెప్టెంబరు 15 : చికిత్స పొందుతూ రైతు మృతి చెందారు. ఆదివారం ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తలూరుకు చెందిన రైతు వంగల నాగేశ్వర్‌రెడ్డి (45) ఈ నెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఎనిమిది ఎకరాల్లో సొంత పొలం, ఐదు ఎకరాలు కౌలు పొలం తీసుకుని వరి, మొక్కజొన్న, పత్తిపంటలు సాగు చేశాడు. సుమారు రూ. 12 లక్షల అప్పు ఉండటంతోనే తన భర్త గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని నాగేశ్వర్‌రెడ్డి భార్య మహేశ్వరి ఫిర్యాదు చేశారు. ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రుద్రవరం, సెప్టెంబరు 15 : ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి నట్లు ఎస్ఐ వరప్రసాద్ ఆదివారం తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు నుంచి ఎలాంటి అనుమతి లేకండా ట్రాక్టరులో ఇసుకను టి.లింగందిన్నె గ్రామానికి తరలిస్తుండగా తనిఖీ చేశామన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి: ఏఐఎస్ఎఫ్



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోడుమూరు, సెప్టెంబరు 15: స్థానిక బీసీ బాలికల ప్రీ మెట్రిక్ హాస్టల్ వార్డెన్ కనకలత విధుల నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. హాస్టల్ ముందు ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, వార్డెన్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నారని అన్నారు. నాయకులు వీరాంజనేయులు, సిద్దు, వినయ్, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 15: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీలో మోక్షగుండం చిత్రపటానికి రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోక్షగుండం దేశం గర్వించదగ్గ ఇంజనీర్ అని కొనియాడారు. దేశవ్యాప్తంగా ఎన్నెన్నో ఆనకట్టల నిర్మాణానికి, పరిశ్రమల స్థాపనకు మార్గదర్శకులుగా నిలిచిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

సి.బెళగల్, సెప్టెంబరు 15: అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయశ్రీ వాహనదారులను హెచ్చరించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, పోలకల్లు, సంగాల, పలుకుదొడ్డి, సి.బెళగల్, క్రిష్ణదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లోని ఎర్రమట్టిని వైసీపీ నాయకులు అనుమతి లేకుండా తరలిస్తున్నట్లు ఆయా గ్రామాల రైతులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. గ్రామాల్లోని వీఆర్వోలు ఎర్రమట్టిని తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎర్రమట్టిని తరలిస్తూ పట్టుబడ్డ వాహనాలను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించాలని వీఆర్వోలకు ఆమె ఆదేశించారు.

ఆలయాన్ని సందర్శించిన ఇస్కాన్ సంస్థ ప్రధాన సేవకులు

కోడుమూరు, సెప్టెంబరు 15: పట్టణంలోని నిర్మాణంలో ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, అయ్యప్పస్వామి దేవాలయాన్ని ఆదివారం ఇస్కాన్ సంస్థ ప్రధాన సేవకులు రూపేశ్వర చైతన్యదాసు సందర్శించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయని, రాబోయే రోజుల్లో ఎంతో ప్రసిద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎద్దుల మహేశ్వర రెడ్డి, వేణు, సత్యారెడ్డి, చిట్టుబాబు, రవి, సత్యరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గన్నారు.

ఉలిందకొండలో గుండె వైద్యశిబిరం

కల్లూరు, సెప్టెంబరు 15: టీడీపీ సీనియర్ నాయకుడు ఈవీ రమణ ఆధ్వర్యంలో ఉలిందకొండ గ్రామంలో గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం శ్రీచక్ర హస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. దాదాపు 200 మందికి పలువు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఈవీ.రమణ, రంగ స్వామిరెడ్డి ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ. 3,11,116ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు. కార్యక్రమంలో యుద్ధం శ్రీనివాసులు, మురళి, బి.సుబ్బరాయుడు, బి.వెంకటేశ్వర్లు, ఈవీ.శ్రీకాంత్, సీవీ రమణ, షేక్షావలి, వాసు, మహేంద్ర పాల్గొన్నారు.

రక్షణ చట్టం కోసం పోరాడాలి: సీఐటీయూ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 15: హమాలీ కార్మికులు సగ్రమమైన రక్షణ చట్టం కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో పి.దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్న హమాలీ కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఆర్.న రసింహులు, రాముడు పాల్గొన్నారు.

'దళిత మహిళపై దాడిని ఖండిస్తున్నాం'

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 15: కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండల కల్లుకుంట గ్రామంలో దళిత మహిళపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ సుభాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత మహిళపై జరిగిన అఘాయిత్యాన్ని ఆయన వివరించారు. దళిత మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

● వినాయక నిమజ్జనం పురస్కరించుకుని నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంచినీళ్ల ప్యాకెట్లు సరఫరా చేసినట్లు నగర అధ్యక్షుడు ఇస్మాయిల్ తెలిపారు. కులమతాలకు అతీతంగా నగరంలో పండుగలు జరుపుకుంటారని ఆయన తెలిపారు.

వాహనాల తనిఖీ

సి.బెళగల్, సెప్టెంబరు 15: మండల కేంద్రమైన సి.బెళగల్ జడ్పీ ఉన్నత పాఠశాల దగ్గర పోలీసులతో కలిసి ఎస్ఐ తిమ్మారెడ్డి ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో తాగునీటి ప్యాకెట్లు పంపిణీ



భక్తులకు తాగునీటి ప్యాకెట్లను అందజేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 15: వినాయక నిమజ్జనం సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు తాగు నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎదుట వినాయక భక్త బృందాలకు, ప్రజల దాహార్తి తీర్చేందుకు నాలుగు వేల మినరల్ వాటర్ ప్యాకెట్లను సరఫరా చేశారు. కార్యక్ర మంలో ఐఎన్టీయూసీ నాయకులు ఎన్ సుంకన్న, సిటీ కాంగ్రెస్ మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, బాషా పాల్గొన్నారు.



గంగమ్మ ఒడికి..





- నగరంలో ఘనంగా వినాయక నిమజ్జనం
- యువత నృత్యాల జోరు
- భక్తులతో నిండిపోయిన ప్రధాన రోడ్లు



20వ వార్డులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత



వినాయకుడికి నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు



యువతుల కేరింతలు



పరిపాలన గణపతితో జిల్లా అధికారులు



మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్నదానం



సోమయాజులపల్లెలో..

కర్నూలు(కల్చరల్, న్యూసిటీ) సెప్టెంబరు 15: నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాలు ఆదివారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేంతవరకు కమనీయంగా సాగాయి. చిన్నా పెద్ద విగ్రహాలు కలిపి సుమారు రెండు వేల విగ్రహాలను ప్రతిష్ఠించగా, నగరంలో వినాయక ఘాట్‌తో పాటు సుంకేసుల రోడ్డులోని స్టాంటన్‌పురం కేసీ కెనాల్, సంకల్‌బాగ్ తుంగభద్ర నదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. నగరపాలక సంస్థ అధికారులు మొత్తం ఎనిమిది భారీ క్రేన్‌లను ఏర్పాటు చేశారు. నగరంలో ప్రధాన మార్గాలు తప్పించి, ఎన్ఆర్ పేట, ప్రకాశ్‌నగర్, రోజావీధి, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, అశోక్‌నగర్, వెంకటరమణ కాలనీ, బాలాజీ నగర్, రామలింగేశ్వరనగర్ తదితర ప్రాంతాలకు చెందిన ఉత్సవ మూర్తులను స్టాంటన్‌పురం వద్దగల కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. గాంధీటవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం కేంద్రంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పూజలు నిర్వహించారు.

● నిమజ్జన కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటలకు మొదలుపెట్టాల్సి ఉండగా అతిథుల రాక ఆలస్యం కావడంతో మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభించారు.

● మధ్యాహ్నం నుంచే వివిధ ప్రాంతాల్లోని విగ్రహాలు ప్రధాన రోడ్లపైకి చేరుకున్నాయి. నగరంలో నాలుగు ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలను కేసీ కెనాల్ వద్ద గల వినాయక ఘాట్‌కు తరలించారు.



మద్దూర్ నగర్‌లో..

● పాతనగరం నుంచి తొలి ఊరేగింపు ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగా, రెండో ఊరేగింపు మధ్యాహ్నం 4 గంటలకు బళ్లారి చౌరస్తా నుంచి, అదే సమయానికి మూడో ఊరేగింపు కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి, నాలుగో ఊరేగిపు నంద్యాల చెక్‌పోస్టు నుంచి మొదలైంది.

● ఈ ప్రధాన రహదారుల్లో ద్విచక్ర వాహనాలు, ప్రభుత్వ వాహనాలు మినహా ఇతర వాహనాలను పోలీసులు అనుమతించలేదు. దీంతో రోడ్లన్నీ భక్తులతో నిండిపోయాయి.

● సాయంత్రం రాజ్‌విహార్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు దారికి ఇరువైపుల భక్తులు ఫ్లాట్‌ఫారాలు, డివైడర్లపై కూర్చొని వినాయక విగ్రహాలను తిలకిస్తూ పరవశించారు.

● వినాయక ఘాట్ వద్ద రోడ్డుకు అటూ, ఇటూ తిరునాళ్లను తలపించేలా పిల్లలను ఆకర్షించే విభిన్న రకాల బొమ్మలతో వ్యాపారులు స్టాళ్లు ఏర్పాటు చేసుకున్నారు. గణేశ్ ఉత్సవాల్లో పిల్లలు ముఖాలకు పెట్టుకునే మాస్కులు, టోపీలు, బెలూన్లు వంటి వాటిని ఆకర్షణీయంగా కనిపించాయి.

● నిమజ్జనాన్ని తిలకించేందుకు కొందరు నగరవాసులు ద్విచక్ర వాహనాలపై తమ పిల్లలను కూర్చొబెట్టుకొని ప్రధాన రహదారుల్లో తిరిగారు.

● కలెక్టరేట్‌లోని పరిపాలన గణపతి ఉత్సవ మూర్తికి ఇన్‌చార్జి ఆర్‌డీవో చిరంజీవి పూజలు చేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● నగర పాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రతిష్ఠించిన ఎనిమిది అడుగుల మట్టి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవంలో భాగంగా కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ నృత్యాలు చేసి అందరిని ఉత్సాహపరిచారు. వీరితో పాటు అధికారులు, యువత డాన్స్ వేస్తూ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఏఈలు దినేష్, జనార్దన్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక ఘాట్ వద్ద గణనాథుల నిమజ్జనం

నగర నడిబొడ్డునగల కేసీ కెనాల్ ఒడ్డున ఉన్న వినాయక ఘాట్‌లో ఊరేగింపుగా తీసుకువచ్చిన గణేశ్ విగ్రహ మూర్తులను నిమజ్జనం చేశారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులతో పాటు ఆర్డీవో శేషిరెడ్డి, విశ్రాంత కలెక్టర్ రాంశంకర్ నాయక్, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, ఎస్వీ మోహన్‌రెడ్డి, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఉమ్మడి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, జిల్లా, నగర అధ్యక్షుడు వేణుగోపాల్, డాక్టర్ మోక్షేశ్వరుడు, 41వ వార్డు కార్పొరేటర్ శ్వేతారెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. జేసీ డాక్టర్ బి. నవ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, ఉత్సవాల ధ్వజారోహణ నందిరెడ్డి సాయిరెడ్డి చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఎస్పీ, నగర మేయర్ ప్రారంభించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలన గణపతికి వారు పూజలు చేసి నిమజ్జనోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన గణపతి మూర్తిని నిమజ్జనం చేశారు. రాంబొట్ల దేవాలయం నుంచి వచ్చిన వివేకానంద యూత్ వారి విగ్రహాన్ని నిమజ్జనం చేయడంతో వరుసగా విగ్రహాలను తరలించే ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యుద్దీపాలతో శోభాయమానంగా వినాయక ఘాట్

వినాయక ఘాట్‌ను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. కెనాల్‌కు రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు నీళ్లలోకి దిగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

● కేసీ కెనాల్ వద్ద జరిగిన నిమజ్జన వేడుకల్లో విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కొట్టే చెన్నయ్య, పరశురాముని రామకృష్ణ వ్యాఖ్యానం చేశారు. ఉత్సవ సమితి నాయకులు రంగస్వామి, గూడా సుబ్రహ్మణ్యం, సందడి మహేష్, సందడి సుధాకర్, అక్కెం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రాంబొట్ల దేవాలయం నుంచి వినాయక ఘాట్ వరకు ఎనిమిది తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది కూడళ్లలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పాతనగరం నుంచి వినాయక ఘాట్ వరకు వివిధ ప్రాంతాల్లో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదానం, అల్పాహారం పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి. అలాగే మంచినీళ్ల ప్యాకెట్లను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణేశ్ నిమజ్జనోత్సవంలో భాగంగా కేసీ కెనాల్ ఘాట్ వద్ద సంస్కార భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల నృత్యాలు, సూర్యకళా అకాడమీ, పవన్ స్టార్ మ్యూజిక్, అన్నమాచార్య సేవా ట్రస్టుచే గణపతి నృత్యాలు, లలితా పీఠం వారి కోలాట నృత్యాలు, విజ్ఞాన పీఠం పాఠశాల విద్యార్థుల చెక్కభజన, నాట్యవేద కళానిలయం, శ్రీరామకృష్ణ పాఠశాల విద్యార్థుల బృంద నృత్యం ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు అతిథులు జ్ఞాపికలు, ప్రశంసాపాత్రాలు అందజేశారు.

నిమజ్జనోత్సవంలో పలుచోట్ల అన్నదానాలు

గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా నగరంలో వివిధ ప్రాంతాల్లో అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు పంపిణీ చేశారు. నగరంలో జడ్పీ కార్యాలయ సమీపంలోని కేఈ ప్లాజాలో మాజీ మంత్రి, సీనియర్ టీడీపీ నేత కేఈ ప్రభాకర్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి స్పందన లభించింది. నగరం లోని వీకర్ సెక్షన్ కాలనీలోగల విగ్రహం వద్ద సీనియర్ రంగస్థల నటుడు గాండ్ల లక్ష్మన్న ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

● బుధవారపేటలోని శ్రీలక్ష్మీ గణేశ్ నగర భక్తబృందం సుశీల నేత్రాలయంలో ఏర్పాటు చేసిన విగ్రహం నిమజ్జనంలో మహిళా భక్తులు ఏకరూప దుస్తులతో ఆకట్టుకున్నారు.

● ఎర్రబురుజు వినాయకుడి విగ్రహం తరలింపులో మహిళ ట్రాక్టర్ నడుపుతూ భక్తులకు ఆకట్టుకున్నారు.

కల్లూరు: గణనాథుడికి జేజేలంటూ డప్పు వాయిద్యాల నడుమ వినాయకుడి విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. కల్లూరు అర్బన్ పట్టణంలో ఆయా వార్డుల్లో మండపాల కమిటీ సభ్యులు, భక్తబృందాల ఆధ్వర్యంలో యువకులు, మహిళలు నృత్యాలు చేస్తూ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

వినాయక మండపాల్లో గౌరు చరిత పూజలు: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆదివారం 19, 20 వార్డుల్లో వినాయక విగ్రహాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, మహిళలు గౌరు చరితను సన్మానించారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు. అలాగే నగరంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు, లడ్డూ వేలం, ఉట్టికొట్టే ఆట, డీజేలతో యువత నృత్యం చేస్తూ కేరింతలు కొట్టారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు కిందకు ఉండటంతో వినాయక శోభాయాత్ర సమయంలో కరెంట్ తీసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. 9 రోజులుగా గణేష్ మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు చేశారు. వినాయుకుని లడ్డూను వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. వినాయకున్ని ట్రాక్టర్‌పై నిమజ్జనానికి తరలించారు. అనంతరం కాల్వబుగ్గలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



నిమజ్జనంలో యువత కేరింతలు



వాసవీనగర్‌లో..



ట్రాక్టర్ నడుపుతున్న మహిళ



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

నేడు ఉపాధ్యాయులకు వైద్య శిబిరం

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 15: ఉపాధ్యాయులకు సోమవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ నాయకులు నాగరాజు తెలిపారు. మధు హాస్పిటల్స్ వైద్యులు పరీక్షించి మందులు ఇస్తారన్నారు. చంద్ర యాదవ్ రమేష్ నాయుడు, మహాదేవప్ప, సుంకన్న పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ మాయం

ఆదోని రూరల్ సెప్టెంబర్ 15: మండలంలోని పెద్దతుంబళం నక్షత్ర ఆకార రాముడి ఆలయంలో హుండీ మాయమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు.. ఈనెల 9వ తేదీన దొంగలు సీసీ కెమెరాలను పనిచేయకుండా చేసి, హుండీ తీసుకెళ్లిపోయారు. గ్రామస్థులు ఈవో వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. దొంగతనం విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. దొంగతనంపై గ్రామస్థులు బసవరాజు, నరసయ్య, రాముడు, ఈరన్న, తిక్కన్న, ఈరప్ప ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మిగనూరు డీఎస్పీగా ఉపేంద్ర బాబు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 15: ఎమ్మిగనూరు డీఎస్పీగా ఎం.ఉపేంద్రబాబును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సీతారామయ్య ఎన్నికలనంతరం మెడికల్ లీవ్‌లో ఉన్నారు. తాజాగా ప్రభుత్వ చేపట్టిన బదిలీల్లో సీతారామయ్యను గుంటూరు ఎస్బీ డీఎస్పీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో అనకాపల్లి దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఉపేంద్రబాబును ఎమ్మిగనూరుకు నియమించింది.



పేదల అభ్యున్నతి కోసమే ఆర్డీటీ సేవలు



సామేలు కుటుంబంతో మాట్లాడుతున్న స్పెయిన్ దేశస్థులు

మంత్రాలయం, సెప్టెంబరు 15: గ్రామాల్లో నిరుపేదల కుటుంబాల అభ్యున్నతి కోసమే ఆర్డీటీ సేవలందిస్తుందని స్పెయిన్ దేశస్థులు మ్యానెల్, క్యాటీ అన్నారు. ఆదివారం వగరూరు గ్రామానికి చెందిన సామేలు, సోనియా కుటుంబాన్ని సందర్శించారు. విద్య, సంక్షేమం, వైద్యం, భూముల అభివృద్ధి, కుట్టు శిక్షణ, వంటి సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. పిల్లలు ప్రసన్నరాణి, రాజు, యువరాజుకు దుస్తులు, సరుకులు, మిఠాయిలు అందజేశారు. ఏరియా టీం లీడర్ కృష్ణయ్య, సీఓ నరసింహులు, లీడర్లు లాజరు, సంసోను, మత్తయ్య, మునెప్ప, ఆదాము, ఏసేపు, దానియేలు పాల్గొన్నారు.

నిందితులకు రిమాండు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 15: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో సైపుల్లా, రజాక్‌పై దాడి చేసిన ఏ3 టపాల్ అబ్దుల్లా, ఏ4 బీఎండీ వాసింలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ సుదర్శన్ రెడ్డి ఆదివారం తెలిపారు. కొన్ని రోజుల క్రితం సైపుల్లా, రజాక్‌పై కత్తితో దాడిచేసి గాయపరిచిన కేసుల్లో నిందితులు కొందరిని ఇప్పటికే అరెస్ట్ చేయగా, మిగిలిన వారు టపాల్ అబ్దుల్లా, బిఎండి వాసిం స్టేషన్‌కు వచ్చి లొంగిపోయారు. కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండుకు ఆదేశించారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

కౌతాళం, సెప్టెంబరు 15: మండలంలోని నదిచాగి గ్రామానికి చెందిన రైతు దేవన్నగౌడ్ ఆదివారం పాము కాటుకు గురయ్యాడు. తన వరి పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. గ్రామస్థులు కౌతాళం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేడు మిలాద్ ఉన్ నబీ

మద్దికెర, సెప్టెంబరు 15: మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఖాజావలి, ఖలీల్ తెలిపారు. సాయంత్రం ఊరేగింపు అనంతరం నమాజ్ ఉంటుందన్నారు. కాగా ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకోవాలని ఎస్ఐ విజయకుమార్ సూచించారు. బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జలంలేని మిషన్

- అతీగతి లేని జలజీవన్ మిషన్
- ప్రజలకు అందని తాగునీరు



అలంకారప్రాయంగా ఉన్న ఇంటింటి కొళాయిలు



పైపులైన్ దుస్థితి

మద్దికెర, సెప్టెంబరు 15: మండలంలో 45వేల జనాభా ఉండగా, ఓటర్లు 12వేలమంది. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పేరుతో పథకంతో ఇంటింటికీ నేరుగా కొళాయి ద్వారా ఉచితంగా నీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ ప్రకటన క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. ఇందుకు రూ2. కోట్లు మంజూరు చేశారు. మద్దికెర సాయినగర్ కాలనీ, బొజ్జనాయుని పేట, ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. పైపులైన్లు ఏర్పాటు చేసి, సాయినగర్‌లో మాత్రం ఇంటింటికీ కొళాయిలు కూడా బిగించారు. కానీ ఇంత వరకు నీరు మాత్రం సరఫరా కాలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు ఆగిపోయినట్లు సమాచారం.

పనులు త్వరగా పూర్తి చేయాలి



ఇంటింటికి కొళాయి ద్వారా నీరు అందించాలి. ఎనిమిది నెలల కిందట కొళాయిలు బిగించారు. కానీ నీరు రావడం లేదు.

\- గుడి ఎల్లప్ప, సాయినగర్, మద్దికెర

త్వరలో తాగునీరు

ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు చేస్తున్నాం, పైపులైన్ పనులు పూర్తి అయ్యాయి. త్వరలోనే ఇంటింటికి తాగునీరు అందిస్తాం - మయాంక్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్



కోసిగిలో ఆటోలో వెళుతున్న కూలీలు

ప్రమాదకర ప్రయాణం

త్వరగా వెళ్లాలనో, లేక బస్సులు లేకో ఇలా కోసిగిలో నిత్యం ప్రయాణాలు చేస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రాణాలు గాలిలో కలిసిపోవలసిందే..!

\- కోసిగి

చైర్మన్ పదవి బలిజలకు ఇవ్వాలి

మద్దికెర, సెప్టెంబరు 15: కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవిని బలిజలకు ఇవ్వాలని సౌత్ ఇండియా కాపు కార్పొరేషన్ జిల్లా అధ్యక్షులు వైపీ వీరన్న రాయల్ ఆదివారం డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు లేఖ రాశానన్నారు. రాయలసీమలో బలిజలు అధికంగా ఉన్నారని, పదవి ఇస్తే బాగుంటుందన్నారు.

మారెమ్మ జాతర ప్రారంభం

క్రిష్ణగిరి, సెప్టెంబరు 15: పుట్లూరు మారెమ్మ జాతరను ఆదివారం గ్రామ పెద్దలు ప్రారంభించారు. 17న ప్రత్యేక పూజలు, కూష్మాండబలి ఉంటాయని అన్నారు. 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బండలాగుడు పోటీలు, పొట్టేళ్ల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

మార్కెట్ యార్డులో సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 15: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు సౌకర్యాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న డిమాండ్ చేశారు. ఆదివారం యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. రైతులు కష్టపడి పండించిన ఉత్పత్తులను మార్కెట్ తెస్తే ఇక్కడ తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రూ.కోట్లలో వ్యాపారాలు చేస్తూ సౌకర్యాలు కల్పించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఉచిత భోజనం, విశ్రాంతి భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం యార్డు అధికారులు లక్ష్మి, ఎర్రిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, హనుమంతు, ప్రదీప్, జయరాజు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- సీపీఎం జిల్లా అధ్యక్షుడు గౌస్‌దేశాయి



బాధితురాలిని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 15: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి చేసినవారిని, సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాయకులు గౌస్‌దేశాయ్, రాధాకృష్ణ, గోవిందు, నారాయణ, డీవైఎఫ్ఐ సురేష్ కుమార్ ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించారు. సభ్యసమాజం తలదించుకునేలా దళిత మహిళపై దాడిచేయటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేయాలని, దాడి వెనుక ఎవరున్నా వదిపెట్టవద్దన్నారు. పోలీసులు గ్రామానికి చేరుకొని బాధితురాలిని రక్షించినందుకు అభినందించారు. ఎస్పీ, డీఎస్పీ గ్రామాన్ని సందర్శించాలని కోరారు. రాముడు, లక్ష్మినరసయ్య, అబ్దుల్లా, వెంకటేశ్ శెట్టి, పెద్దకడుబూరు తిక్కన్నగౌడ్, పరమేష్ పాల్గొన్నారు.

మానవ హక్కుల వేదిక నాయకుల పరామర్శ

ఎమ్మిగనూరు టౌన్ : బాధితురాలు గోవిందమ్మను మానవ హక్కుల వేదిక నాయకులు పరామర్శించారు. యూజీ శ్రీనివాసులు, దేవేంద్రబాబు, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసన్న తిక్కయ్య, తస్లిమా, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరీదేవి పౌర్ణమి వేడుకలు



జ్యోతుల ఉత్సవంలో భక్తులు (ఫైల్)

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 15: పట్టణంలోని రెడ్డిబావి వీధిలో ఉన్న చౌడేశ్వరీదేవి పౌర్ణమి వేడుకలు నేటితో ప్రారంభమవుతాయి. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు అభిషేకం, అర్చన, మంగళహారతి, తీర్థప్రసాదాలతో పూజలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు గంగపూజ, 8 గంటలకు మహామంగళహారతి ఇస్తారు. 17న మంగళవారం తెల్లవారుజాము 3 గంటలకే ఆలయం దగ్గర నుంచి జ్యోతుల మహోత్సవం ప్రారంభించి పల్లకీని ఊరేగిస్తారు.

జ్యోతుల మహోత్సవం ఇలా..

పట్టణంలో ఏటా మహాలయ పౌర్ణమి వేడుకల సందర్భంగా జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తారు. 17న మంగళవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 8.30 గంటల వరకు తొగాట వీరక్షత్రీయుల ఆధ్వర్యంలో చౌడేశ్వరి దేవి జ్యోతుల వైభోత్సవం నిర్వహిస్తారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెల్దుర్తి, సెప్టెంబరు, 15: పట్టణంలోని జడ్పీహెచ్ పాఠశాలకు చెందిన పదో తరగతి 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం శ్రీ విద్యా నికేతన్ స్కూల్‌లో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమ తెలుగు ఉపాధ్యాయుడు శంకరయ్యను సన్మానించారు. ఆపదలో ఉన్న మిత్రులను ఆదుకేనేందుకు పూర్వ విద్యార్థి మురళిగౌడ్ రూ.35వేలు విరాళం ప్రకటించారు.



వెల్దుర్తి: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

25ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని వేణువిద్యాలయం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పదోతరగతి 1999-2000 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఉత్తమ్ ఫంక్షన్ హాల్‌లో 25 ఏళ్ల తరువాత సమావేశమయ్యారు. కొందరు ప్రభుత్వ,ప్రైవేట్ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. మిత్రులను కలుసుకొని గత స్మృతులను స్మరించుకున్నారు. నాటి హెచ్ఎం. కీ.శే. యూ.యూ.ఉరుకుందు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు సుధాకర్, నాగరాజు, వెంకటేష్, వేణుగోపాల్, ఉమా హాజరయ్యారు. తామ విద్యా, బుద్ధులు నేర్పిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. విద్యార్థులు రాజశేఖర్, నీలకంఠ, ఉరుకుందరెడ్డి, రమేష్, జయరాము, ఆది, సతీష్, ఉమా, శ్రీదేవి, సుధా పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



మద్దికెరలో విరాళాలు సేకరిస్తున్న సమితి సభ్యులు

మద్దికెర, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాదితుల కోసం విరాళాలు సేకరిస్తున్నట్లు ఆపద్బాంధవ సేవా సమితి, సీపీఎం నాయకులు తెలిపారు. ఆదివారం సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్, సీపీఎం మండల కార్యదర్శి కడవల రవికుమార్ విరాళాలను సేకరించారు. మండలంలో రూ.30వేలు అందిం దన్నారు. తాము నేరుగా బాధితుల వద్దకు వెళ్లి నిత్యావసర వస్తువులు అందజేస్తామని తెలిపారు. వరద బాధితులకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 15: క్రీడలతో నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చని రోటరీ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి సందీప్ రెడ్డి, డాక్టర్ సైపుల్ల అన్నారు. ఆదివారం మల్లికార్జున విద్యాలయంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహిం చారు. కరస్పాండెంట్ సుగురప్ప, విశ్వనాథ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు. జీవన్ సింగ్, సునీల్ రెడ్డి, భరత్‌ష షాబీర్ అహ్మద్, విట్టా మురళి, బసవరాజు, రాయచోటి సుబ్బయ్య, శ్రీధర్ రెడ్డి, బసవరాజు ఉమేష్ బాయ్ పద్మనాభయ్య శెట్టి విట్టా రాజేష్ హుస్సేన్ శివరాం పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 15: దివ్యాంగుల హక్కుల సాధనకు సమష్టిగా కృషి చేస్తామని సాయి దివ్యాంగుల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు వాల్మీకి రామాంజినేయులు, మండల అధ్యక్షుడు జే.వీరేశ్ అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయం హాల్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కమ్మరచేడు వీరేశ్, ఉపాధ్యక్షుడిగా ముద్దనగేరి ఉమ, కార్యదర్శిగా మహదేవమ్మ, సహయ కార్యదర్శిగా యంకప్ప, కోశాధికారిగా నౌనేపాటిని ఎన్నుకున్నారు. సభ్యులు కనక దుర్గ, ఈరన్న, గోవిందరాజు, లక్ష్మి, సిద్దప్ప పాల్గొన్నారు.



శ్రీమఠం మేనేజర్ రాజీనామా

- ఆమోదించిన పీఠాధిపతి
- అనారోగ్య కారణాలతోనే : శ్రీనివాసరావు

మంత్రాలయం, సెప్టెంబరు 15: రాఘవేంద్రస్వామి మఠం మేనేజరు- ఏ శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం రాత్రి మాట్లాడుతూ తాను రాజీనామా లేఖను ఈనెల 8న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులుకు అందజేశానని మొదట తిరస్కరించారని, అయితే ఆదివారం ఆమోదించారని అన్నారు. తనకు ఆరోగ్యం సహకరించడం లేదని, 74 ఏళ్ల వయస్సులో పని చేయడం ఇబ్బందిగా ఉన్నారు. తనకు ఇంతవరకు సహకరించిన మఠం శాఖల అధికారులకు, సిబ్బందికి, ప్రభుత్వ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా మేనేజర్-ఏ పదవీలో ఎవరినీ నియమిస్తారో ఇంకా ఖరారు కాలేదు. ఎస్కే శ్రీనివాసరావు రాజీనామా మంత్రాలయంలో చర్చనీయాంశగా మారింది.



మేనేజర్ శ్రీనివాసరావు

ఘనంగా ఇంజనీర్స్ డే



ఇంజనీర్లను సన్మానిస్తున్న సభ్యులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 15 : పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఇంజనీర్స్ డే నిర్వహించారు. విశ్రాంత ఇంజనీర్ మల్లికార్జున గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ చైర్మన్ గోపీనాథ్ మాట్లాడుతూ, నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయ న్నారు. చైర్మన్ గోపినాథ్, ప్రసాదరాజు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, కాశాధికారి శంకరమ్మ, వన్నప్ప రాజు, ఆవోపా సభ్యులు రఘు పాల్గొన్నారు. యల్‌టీపీల అసోసియేసన్ ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ టెక్నీకల్ పర్సన్స్ అసోసియేషన్ వారు ఇంజనీర్స్ డే నిర్వహించారు. బిట్స్ ఇంజనీరింగ్ కాలేజి అధ్యాపకుడు శ్రీనివాస చౌదరి, నర్సప్ప, ఆర్అండ్‌బీకు చెందిన మహిళా ఇంజనీర్ శ్వేతను సన్మానించారు. గౌరవ అధ్యక్షుడు పెద్ద ప్రసాద్, అధ్యక్షుడు రంగస్వామి చంద్రశేఖర్, ఆదేన్న పాల్గొన్నారు.

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, సెప్టెంబరు 15: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక జడ్జి జస్టిస్ రామచంద్ర ఆదివారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. ఆదివారం గెస్ట్‌హౌస్‌లో బసచేసి సోమవారం ఉదయం పూజలు చేయనున్నారు. ఎస్ఐ పరమేష్ నాయక్, బిందుమాధవ్ పాల్గొన్నారు.





రహదారులు బాగు చేయండి

ఆలూరు, సెప్టెంబరు 15: ఆదోని నియోజకవర్గంలో వర్షాలకు ఛిద్రమైన రహదారులను బాగు చేయాలని సీపీఎం నాయకుడు నారాయణ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెద్ద హోత్నూరు సమీపంలో రోడ్లు గుంతలమయంగా మారి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరు పట్టణంలో జాతీయ రహదారి పనులు సైతం ఆగిపోవడంతో నిత్యం మంత్రాలయం, బళ్లారికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి రహదారిని పూర్తి చేయాలని కోరారు. అలాగే డణాపురం నుంచి హొళగుంద రహదారి అధ్వానంగా ఉందని, ప్రజలు ఆందోళనలు చేసినా రోడ్డు నిర్మాణం పూర్తి చేయలేదని, అధికారులు స్పందించాలని కోరారు.

పెద్దహోతూరులో సప్తభజన

ఆలూరు రూరల్, సెప్టెంబరు 15: మండలంలోని పెద్దహోతూరు గ్రామం హుచ్చీరప్ప తాత ఆలయంలో 6వ రోజు ఆదివారం సప్త భజన కొనసాగింది. ఉదయం హుచ్చీరప్ప తాతకు ఆకుపూజ, పంచామృతాషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి, ప్రత్యేక పూజలను పీఠాధిపతి చంద్రమౌళి, సిద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం గొల్ల సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు, గజమలలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.